

తస్మాత్ జాగ్రత్త..
ఇటీవల ట్రయల్ రూమ్, హాస్టల్ గదుల్లో స్పై కెమెరాలు అమర్చిన ఘటనలు వింటున్నాం. అలాంటి ప్రదేశాల్లో మహిళలు అప్రమత్తంగా ఉండాలని పలువురు సూచిస్తున్నారు. - 8లో ▸



..పరిశోధనలు అవసరం
కేన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధనలు అవసరమని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ గీత తెలిపారు. - 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $31^{0}/24^{0}$
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత పలు ప్రాంతాల్లో చిరు జల్లులు కురుస్తాయి. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వైద్య పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంజీఎం: కాకతీయ మెడికల్ కళాశాలలో వివిధ విభాగాల్లో కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వర్తించేందుకు 68 అసిస్టెంట్ ప్రొఫెసర్, నాలుగు సీఏఎస్ ఆర్ఎంఓ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1.25 లక్షలు, సీఏఎస్ ఆర్ఎంఓకు రూ.52 వేలు వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. పోస్టుల జాబితా కళాశాల వెబ్‌సైట్ http:/www.kmcwgl.comలో పొందుపర్చినట్లు తెలిపారు. వెబ్‌సైట్ నుంచి దరఖాస్తుఫామ్ డౌన్‌లోడ్ చేసుకుని ప్రిన్సిపాల్ కార్యాలయంలో సమర్పించాలని కోరారు. దరఖాస్తులు 27వ తేదీ నుంచి అక్టోబర్ 3వతేదీ వరకు కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి



విద్యారణ్యపురి: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, వాటిని వినియోగిస్తే అనారోగ్య సమస్యలొస్తాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలితాకుమారి విద్యార్థులకు సూచించారు. 'టుబాకో ఫ్రీ యూత్ చాంపియన్ 2.0' కార్యక్రమం సందర్భంగా హనుమకొండలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలితాకుమారి ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పొగాకు ఉత్పత్తులు, గుట్కా, పాన్‌మసాలాలు వినియోగించడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సయ్యద్ అహ్మద్, ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ వాణి, హెల్త్ సూపర్‌వైజర్ రామచందర్, విప్లవ్, సోషల్ వర్కర్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి ఇంటర్ కాలేజీయెట్ టోర్నమెంట్స్

హసన్‌పర్తి: ఈనెల 29వ తేదీ నుంచి రెండ్రోజుల పాటు ఇంటర్ కాలేజీయెట్ పురుషుల టోర్నమెంట్స్ నిర్వహించనున్నట్లు కిట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్‌లో భాగంగా కిట్స్‌లో షటిల్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్, చెస్, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి బర్దన్



న్యూశాయంపేట: దేశ రాజకీయాలకు దిక్సూచి, బహుముఖ ప్రజ్ఞాశాలి సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏబీ. బర్దన్ అని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. బుధవారం బాలసముద్రలోని పార్టీ కార్యాలయంలో బర్దన్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లేశ్, శ్రీనివాస్, ఎ. శ్రీనివాస్, సారంగపాణి, శంకర్, రాజేందర్, అశోక్, పూర్ణచందర్, శివ పాల్గొన్నారు.

ప్రొబేషనరీ ఎస్సైలకు స్టేషన్ల కేటాయింపు

వరంగల్ క్రైం: శిక్షణ పూర్తి చేసుకుని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు వచ్చిన ప్రొబేషనరీ ఎస్సైలకు స్టేషన్లు కేటాయిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి పోలీస్‌స్టేషన్ ఈనెల 25 నుంచి వచ్చే నెల 9 వరకు, రెండో పోలీస్ స్టేషన్‌కు వచ్చే నెల 10 నుంచి 24వ తేదీ వరకు పనిచేసేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెండో బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ప్రొబేషనరీ ఎస్సైలకు పోలీస్‌స్టేషన్లు కేటాయించారు. పల్లె ప్రవీణ్– కాజీపేట, మామునూరు, బొల్లబోయిన హేమలత– సుబేదారి, వర్ధన్నపేట, బండారి శివ – మిల్స్ కాలనీ, రఘునాథపల్లి, బొమ్మినేని సుజాత – ఆత్మకూరు, హనుమకొండ, అనంతగిరి మధు – జనగామ, ఇంతేజార్‌గంజ్, లింగాల దిలీప్ – నర్సంపేట, హసన్‌పర్తి, పల్లి భాగ్యశ్రీ – ఘన్‌పూర్, పరకాల పోలీస్ స్టేషన్లను కేటాయించారు.









వివిధ రాష్ట్రాల సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి తదితరులు



చీర కట్టులో విద్యార్థినులు

వెల్లివిరిసిన సంప్రదాయం

వరంగల్ కాకతీయ వైద్య కళాశాల విద్యార్థులు ఉత్కర్ష–2024లో భాగంగా ఐదో రోజు బుధవారం ట్రెడిషనల్ డే నిర్వహించారు. విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంప్రదాయ వస్త్రధారణలతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం దాండియా నిర్వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్య ముఖ్య అతిథిగా పాల్గొని, విద్యార్థులను ప్రశంసించారు. విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి బహుమతులు అందజేశారు.


– సాక్షి ఫొటోగ్రాఫర్, వరంగల్

స్టేషన్‌లో 24/7

మత్తు, మగువ, మద్యానికి కేరాఫ్ హనుమకొండ బస్‌స్టేషన్ ప్రాంతాలు



- మధ్యవర్తులుగా మీడియాలోని కొందరు
- మేమున్నామంటూ పోలీసులకు భరోసా
- మామూళ్ల మత్తులో చూసీచూడనట్లుంటున్న ఖాకీలు



వసతి.. విలాసం!

హనుమకొండ బస్టాండ్‌కు కేవలం మూడు వందల మీటర్ల పరిధిలో ఆస్పత్రులు, వాణిజ్య సముదాయాలున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా.. కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు చెందిన ప్రజలు వేల సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. వచ్చిన వారిలో కొందరికి అనుకున్న పని వాయిదా పడి.. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోని లాడ్జీల్లో వసతి పొందుతుంటారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో పాటు నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతకు సైతం బస్‌స్టేషన్ కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయింది. బస్‌స్టేషన్ అడ్డాగా కొన్నేళ్లుగా గంజాయి, మద్యం, మగువలతో ఓ మాఫియా యథేచ్ఛగా వ్యాపారం కొనసాగిస్తోంది. బేరం కుదిరితే చాలు సమయంతో సంబంధం లేకుండా మగువలను మాఫియా సరఫరా చేస్తోంది. ముఖ్యంగా యువతను టార్గెట్ చేస్తూ దందా కొనసాగిస్తోంది. రాత్రి పది దాటితే బస్ స్టేషన్ చుట్టూ ఈ మాఫియా వల పన్నిన పాత్రధారులే తిరుగుతూ కనిపిస్తారు.

హన్మకొండ చౌరస్తా:

హనుమకొండ బస్ స్టేషన్ అడ్డాగా జరిగే నీచమైన దందాలెన్నో. రాత్రీ పగలు తేడా లేకుండా.. ఇక్కడ అన్ని రకాల సేవలు లభిస్తున్నాయి. మత్తు.. మగువ ఇలా ఏది కావాలంటే అది డబ్బులిస్తే చాలు అన్నీ దొరుకుతున్నాయి. ఓవైపు ఐటీ, వైద్య, విద్యా రంగాల్లో నగరం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుంటే.. మరో వైపు గంజాయి, మద్యం, మగువలతో కొందరు నగర కీర్తిని మసకబారుస్తున్నారు. హనుమకొండ నగర నడిబొడ్డున గంజాయి ప్యాకెట్లు, బీర్లు.. మద్యం బాటిళ్లు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. విటులకు మగువలను సరఫరా చేస్తూ ఓ మాఫియా జేబులు నింపుకుంటోంది.

మధ్యవర్తులుగా..

అనాదిగా ఈ నీచపు దందా నడిపిస్తున్న మాఫియాకు, పోలీసులకు మధ్య కొందరు మీడియా వ్యక్తులు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు స్థానికులు చెబుతుండడం గమనార్హం. ఠాణాకు కొత్త అధికారి రాగానే.. మాఫియా నుంచి మామూళ్లను ఈ మధ్యవర్తులే అందజేస్తున్నట్లు తెలుస్తోంది. మత్తుకో రేటు.. మగువకో రేటును ఈ మీడియేటర్లే ఫిక్స్ చేసి పోలీస్ అధికారులకు చేరవేస్తున్నారనే ఆరోపణలున్నాయి. సిటీలోని మీడియా మొత్తం తమ చేతుల్లోనే ఉందని పోలీసులకు చెబుతున్నట్లు సమాచారం. కాగా.. ముడుపులు అందుతుండడంతో పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బస్టాండ్ ఏరియాలో పెట్రోలింగ్ పెంచాలి..



నిత్యం ప్రజలతో రద్దీగా ఉండే హనుమకొండ బస్టాండ్ ఏరియా రాత్రి అయ్యిందంటే చాలు తాగుబోతులకు అడ్డాగా మారింది. కొన్నేళ్ల క్రితం వరకు తెల్లవార్లూ మద్యం అమ్మే ముఠా, ఇప్పుడు గంజాయి అమ్మకాలకు కేరాఫ్‌గా మారింది. పోలీసులు బస్టాండ్ ఏరియాలో పెట్రోలింగ్ సమయాన్ని పెంచి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. మద్యం, గంజాయి అమ్మకందారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– కల్లూరి పవన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జాతీయ బీసీ యువజన సంఘం

స్పెషల్ టీం ఏర్పాటు చేశాం

హనుమకొండ బస్టాండ్ ఏరియాలో రాత్రి వేళల్లో మద్యం, గంజాయి అమ్ముతున్నట్లుగా మా దృష్టికి రాలేదు. రాత్రి వేళల్లోనే కాదు ఎప్పుడైనా సరే గంజాయి అమ్ముతున్నట్లు తెలిస్తే మాకు సమాచారం ఇవ్వండి. గంజాయితో పాటు ఇతర అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించేందుకు స్టేషన్ పరిధిలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం. ఆ ఏరియాలో పెట్రోలింగ్‌ను పెంచాం. రాత్రీ, పగలు తేడా లేకుండా మా సిబ్బంది బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో గస్తీ కాస్తుంటారు. వ్యభిచారం విషయంలో అనుమానంగా ఎవరు కనిపించినా.. మందలించి అక్కడి నుంచి పంపిస్తున్నాం.

– సతీశ్, సీఐ, హనుమకొండ

స్మార్ట్ పోటీల్లో గ్రేటర్‌కు ఐదో స్థానం

- నైబర్ హుడ్ చాలెంజ్ పోటీల్లో ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్



సర్టిఫికెట్ అందుకుంటున్న ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర

వరంగల్ అర్బన్: ఓరుగల్లు మహా నగరానికి అరుదైన గౌరవం దక్కింది. దేశవ్యాప్తంగా 100 స్మార్ట్ సిటీ నగరాల్లో నర్చరింగ్ నైబర్ హుడ్ చాలెంజ్ (ఎన్ఎన్‌సీ) పోటీల్లో టాప్–5లో స్థానం దక్కించుకుంది. కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి గృహ మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్‌యూఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలో ప్రాతినిధ్యం దక్కింది. ఈమేరకు బుధవారం న్యూ ఢిల్లీలో స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్ మిషన్ డైరెక్టర్ రాహుల్ కపూర్ చేతుల మీదుగా నైబర్ హుడ్ చాలెంజ్ ఎక్స్‌లెన్స్ సర్టిఫికెట్ (అవార్డు)ను బల్దియా ఎస్ఈ ప్రవీణ్ చంద్ర అందుకున్నారు. ఎన్ఎన్‌సీ పోటీల్లో బెంగళూరు, ఇండోర్, జబల్‌పూర్, కొచ్చి నగరాల తర్వాత వరంగల్ ఐదో స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నర్చరింగ్ నైబర్ హుడ్ చాలెంజ్‌లో వరంగల్ ఎంహెచ్ నగర్‌లో చిట్టి పార్క్ 56 గంటల రికార్డ్ స్థాయిలో ఏర్పాటు చేశారు. క్రిస్టియన్ కాలనీలో నైబర్ హుడ్ పార్క్, కరీమాబాద్‌లో గుండు బావి, శ్రీనగర్ కాలనీలో సెన్సోరి పార్కు, ఎల్‌పీ స్కూల్‌లో సైన్స్ పార్క్, అంబేడ్కర్ కూడలి వద్ద బుద్ధ ప్లాజాలను నిర్దేశిత సమయాల్లో ఏర్పాటు చేసి డాక్యుమెంట్లను సమర్పించారు. ఈనేపథ్యంలో దేశవ్యాప్తంగా కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయగా.. వరంగల్ నగరానికి సర్టిఫికెట్ దక్కింది. టాప్‌లో నిలిచిన వరంగల్‌కు ఫేజ్–2లో మరిన్ని పార్కుల అభివృద్ధికి నిధులు కేటాయించే అవకాశం ఉందని మేయర్ గుండు సుధారాణి తెలిపారు. ఈసర్టిఫికెట్ లభించడంపై మేయర్, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హర్షం వ్యక్తం చేశారు.

వెహికిల్ షెడ్ నిర్వహణ ఇదేనా?

- ఇంజనీర్లపై మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే నాయిని ఆగ్రహం



వెహికిల్ షెడ్డును తనిఖీ చేస్తున్న మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

వరంగల్ అర్బన్: హనుమకొండ బాలసముద్రంలోని వెహికిల్ షెడ్డు నిర్వహణపై మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం వారు వెహికల్ షెడ్డును పరిశీలించారు. పదుల సంఖ్యలో మరమ్మతుల కోసం నిలిచిన వాహనాలు, బురదమయంగా మారిన ఆవరణ చూసి అసహనం వ్యక్తం చేశారు. చిన్న వాహనాల ద్వారా సేకరించిన చెత్తను షెడ్ నుంచి భారీ వాహనాలకు తరలించే క్రమంలో బాలసముద్రం పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది కలుగుతున్నదని, ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని ఆదేశించారు. వాహనాలకు అవసరమైతే వీలైనంత త్వరగా మరమ్మతులు చేయించాలన్నారు. సరైన రోడ్డు లేకపోవడంతో భారీ వాహనాలు ఆలస్యంగా వెళ్లడంపై ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో సీసీ రోడ్డు నిర్మాణం ప్రతిపాదనల్లో ఉందని ఇంజనీర్లు వివరించారు. విధులకు హాజరుకాని డ్రైవర్, కార్మికులపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారివెంట అధికారులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో ప్రమాణాలు పాటించాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ప్రధాన కార్యాలయంలో డిపార్ట్‌మెంట్, ప్రైవేట్ ఎస్‌పీఎం షెడ్ల నిర్వాహకులు, అందులో పని చేసే సిబ్బందికి తోషిబా కంపెనీ వారిచే ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుపై స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ నిర్వహించారు. ఇందులో సీఎండీ కర్నాటి వరుణ్ మాట్లాడుతూ.. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్లు పునరావృతమవకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వైండింగ్‌లో సమస్యలున్నాయా? ఆయిల్ ఫిల్టర్‌లో డస్ట్, కోర్‌లో చిప్పింగ్, మాయిశ్చర్ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి బాగు చేయాలన్నారు. ప్రతీ జిల్లాలో డిపార్ట్‌మెంట్, ప్రైవేట్ ఎస్‌పీఎం షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే.. ప్రతీ జిల్లాకు మోడల్ ఎస్‌పీఎం షెడ్‌ను నెలకొల్పుతామన్నారు. డిపార్ట్‌మెంట్ షెడ్లు అన్నింటినీ ఆధునికీకరిస్తామన్నారు. మెరుగైన, నాణ్యమైన మరమ్మతులు పెరగడానికి ప్రైవేట్ ఎస్‌పీఎం షెడ్ల నిర్వాహకులను వివిధ కంపెనీల్లో చేస్తున్న మరమ్మతుల అధ్యయనానికి పంపించనున్నట్లు తెలిపారు. నిర్వాహకులు, సిబ్బందికి ఉండే సందేహాలు నివృత్తి చేసేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. శిక్షణ కార్యక్రమాలు ఈ నెల 29 వరకు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు టి.సదర్‌లాల్, టి.మధుసూదన్, సీజీఎం కేఎస్ గుట్ట, జీఎం అన్నపూర్ణ, హనుమకొండ ఎస్ఈ కె.వెంకటరమణ పాల్గొన్నారు.

'పశ్చిమ' కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం

దాస్యం వినయ్ అధ్యక్షతన హైదరాబాద్‌లో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హన్మకొండ: హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. భవిష్యత్ మనదే, కార్యకర్తలు నిరుత్సాహాన్ని వీడాలని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజల్లో ఉండాలని, వారి సమస్యలపై పోరాడాలని దిశానిర్దేశం చేశారు. భవిష్యత్‌లో పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు, పార్టీ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మర్రి యాదవరెడ్డి, కె.వాసుదేవ రెడ్డి, జోరిక రమేశ్, సోదా కిరణ్, ఉడతల సారంగ పాణి పాల్గొన్నారు.

జర భద్రం బ్రదర్

- బ్రిడ్జిలపై తరచూ ప్రమాదాలు
- భయపెడుతున్న గుంతలు
- నో రెయిలింగ్.. నో సైన్ బోర్డ్స్
- ఆర్అండ్‌బీ అధికారుల అలసత్వం
- ప్రయాణికులకు ప్రాణ సంకటం



గుంతలు పడిన వరంగల్ బట్టలబజార్ బ్రిడ్జి



రెయిలింగ్ లేని హంటర్‌రోడ్ బ్రిడ్జి



చింతల్ బ్రిడ్జిపై ఢీకొన్న కార్లు (ఫైల్)



ప్రమాదకరంగా వరంగల్ చింతల్ బ్రిడ్జిపై మలుపు

న్యూశాయంపేట: గ్రేటర్ వరంగల్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. వాటిపై ప్రయాణం చేయాలంటే భయంతో వణుకుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే హనుమకొండ హంటర్‌రోడ్ బ్రిడ్జి, వరంగల్ బట్టల బజార్‌బ్రిడ్జి, వరంగల్ చింతల్ బ్రిడ్జిలపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా బ్రిడ్జిల గుండా ప్రయాణించాలంటే భయపడుతున్నారు. బ్రిడ్జిలపై గుంతలు ఏర్పడడం, ప్రమాదాల నివారణ కోసం రెయిలింగ్‌లు లేకపోవడం, సూచిక బోర్డులు లేకపోవడం, రాత్రి వేళల్లో బ్రిడ్జిలు అంధకారంలో ఉండడం కారణంగా వివిధ పనుల కోసం రాకపోకలు సాగించేవారు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. కొందరు మత్యువాత పడున్నారు. ఇవి నిర్మించి ఏళ్లు గడుస్తున్నా.. ఆర్అండ్‌బీ అధికారులు కనీస చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని వాపోతున్నారు.

గుంతలమయంగా బట్టల బజార్ బ్రిడ్జి..

నిత్యం వేలాది మంది ప్రయాణించే వై ఆకారం బ్రిడ్జి గుంతలమయమైంది. బట్టల బజార్‌వైపు బ్రిడ్జిపై పలుచోట్ల గుంతలు ఏర్పడి అధ్వాన స్థితికి చేరుకుంది. పెద్ద పెద్ద గుంతలతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. మరమ్మతులు చేపట్టడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బ్రిడ్జిపై గుంతలు మరీ పెద్దవిగా తయారై వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనదారులకు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి.

అంధకారంలో హంటర్‌రోడ్ బ్రిడ్జి

హంటర్‌రోడ్ బ్రిడ్జిపై లైట్లు వెలగడం లేదు. బ్రిడ్జికి ఉర్సు గుట్ట వైపు రెయిలింగ్ లేకపోవడం, సైన్ బోర్డులు లేకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడి మూల మలుపు ప్రమాదకరంగా ఉంది. తరచూ ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఏళ్ల క్రింద నిర్మించిన వంతెనకు కనీస మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చింతల్ బ్రిడ్జి మలుపు..

చింతల్ వై ఆకారం బ్రిడ్జిపై మూల మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగున్నాయి. సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ బ్రిడ్జిపై రాత్రివేళ అదుపుతప్పి వాహనాలు బోల్తా కొట్టిన ఘటనలు అనేకం. మూలమలుపువద్ద వాహనాలు ఢీకొట్టి ప్రయాణికులు గాయాలపాలై మత్యువాత పడ్డారు. అధికారులు సరైన ప్రణాళికలు రూపొందించి ప్రమాదాల నివారణకు తగిన కార్యాచరణ చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదాల్ని నివారించాలి..



వరంగల్ చింతల్ బ్రిడ్జిపై ప్రమాదాలు జరుగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. ఇన్నర్ రింగ్‌రోడ్ పనులు వేగంగా పూర్తి చేయాలి. దీంతో భారీ వాహనాల తాకిడి తగ్గుతుంది. ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– గడల రమేశ్, చింతల్, వరంగల్

క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

వరంగల్: రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణను యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం జలాల్‌పూర్‌లోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్(డొమెస్టిక్), సోలార్ సిస్టమ్ ఇన్‌స్టాలేషన్, సర్వీస్, కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీ టీవీ మెకానిజం, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దాజీ, క్విల్ట్ బ్యాగ్స్ మేకింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో ఉచిత హాస్టల్, భోజన వసతితోపాటు ఉద్యోగం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల గ్రామీణ/పట్టణ ప్రాంత అభ్యర్థులు ఈనెల 30వ తేదీ ఉదయం 10గంటలకు స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థకు హాజరు కావాలని తెలిపారు. వివరాల కోసం 91339 08000, 91339 08111, 91339 08222, 99484 66111 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

స్వరం పడి యువకుడి మృతి

ఖిలా వరంగల్ : ఇంట్లో చాయ్ తాగుతున్న ఓ యువకుడు ఒక్కసారిగా స్వరం పడి.. దగ్గుతూ కుప్ప కూలిపోయాడు. హుటాహుటిన ఎంజీఎంకు తరలించగా మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. దీంతో కళ్ల ముందే చేతికి అందొచ్చిన కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషాదకర ఘటన ఫోర్ట్‌రోడ్డు విద్యానగర్ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన శీలం బాబురావు చిన్న కుమారుడు రాహుల్ (27) బుధవారం ఉదయం ఇంట్లో టీ తాగుతున్నాడు. ఈక్రమంలో స్వరం పడి దగ్గుతూ కుప్ప కూలిపోయాడు. హుటాహుటిన ఎంజీఎం తరలించారు. వైద్య పరీక్షలు చేయగా అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై బాబురావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



తస్మాత్ జాగ్రత్త.. కనిపించని కన్ను చూస్తోంది..

స్పై కెమెరాలతో అప్రమత్తంగా ఉండాలి

- ఇష్టానుసారంగా వినియోగిస్తున్న ఆకతాయిలు
- అనుమానం వస్తే నిశితంగా పరిశీలించాలి
- ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేయాలి
- టెక్నాలజీని మంచికి ఉపయోగిస్తేనే ఫలితం


స్పైకెమెరాల ఏర్పాటుకు అవకాశం ఉండే ప్రాంతాలు

కాజీపేట: టెక్నాలజీ.. మానవాళికి ఎంత మంచి చేస్తోందో.. ఆకతాయిలు, సంఘ విద్రోహుల చేతిలో పడి అంతే చెడు చేస్తోంది. ఫేస్‌బుక్, వాట్సాప్, యూ ట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలను అనుసరించి వ్యాపార అభివృద్ధి, స్నేహం, నాలెడ్జి పెంచుకుంటున్న వారు కొందరైతే.. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల సరఫరా, ఉద్యోగాల పేరుతో మోసానికి పాల్పడుతున్న వారు మరికొందరు. కాగా, ఇటీవల ట్రయల్ రూమ్, హాస్టల్ గదుల్లో స్పై కెమెరాలు (సీక్రెట్ కెమెరా) అమర్చిన ఘటనలు వింటున్నాం. విస్తరిస్తున్న టెక్నాలజీని ఇలా అడ్డదిడ్డంగా వినియోగిస్తే తర్వాత జైలుకెళ్లడం ఖాయం. స్వల్ప పరిమాణంలో ఉండే ఈ స్పై కెమెరాలతో ఆకృత్యాలకు ఒడిగడుతున్న వారు రోజురోజుకూ పెరిగిపోతున్నారు. షాపింగ్ మాళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జిలు..ఇలా పబ్లిక్ ప్రదేశాల్లో ఎక్కడ ఏ కెమెరా కన్ను మనపై ఉందో తెలియని పరిస్థితి ఎదురవుతోంది. ముఖ్యంగా మహిళలు ఇలాంటి కెమెరాలకు బలవుతున్న ఘటనలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయి. అయితే కాస్త అప్రమత్తంగా ఉండి టెక్నాలజీని ఎలా వినియోగించాలో తెలిస్తే స్పై కెమెరాలను ఇట్టే గుర్తించే వీలుంది. అలా గుర్తించి పోలీసుల దృష్టికి తీసుకెళ్తే ఆకతాయిల పని పట్టేందుకు అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో స్పై కెమెరా పని విధానం, ఆ కెమెరాను గుర్తించే వివిధ మార్గాల గురించి 'సాక్షి' ప్రత్యేక కథనం..

గుర్తించడం ఎలా?

స్మార్ట్‌ఫోన్లు వాడేవారికి గూగుల్ ప్లే స్టోర్‌లో హిడెన్ కెమెరా డిటెక్టర్ అనే యాప్ చాలా సందర్భాల్లో పనిచేస్తుంది. ఐ ఫోన్లు వినియోగించే వారికి స్పై హిడెన్ కెమెరా డిటెక్టర్ యాప్ ఉపయోగపడుతుంది. స్పై కెమెరాలు వెలువరించే ఇన్‌ఫ్రారెడ్ కిరణాలను గుర్తించడం ద్వారా గదిని పూర్తిగా డార్క్ చేసినప్పుడు నిర్దిష్ట స్థలంలో కెమెరా ఉందా లేదా అనే విషయం గమనించి మొబైల్ అప్లికేషన్‌లో వాటిని చూపిస్తాయి. స్పై కెమెరాలను గుర్తించడానికి బగ్ డిటెక్టర్ అనే ప్రత్యేక పరికరాలుంటాయి.

మోషన్ డిటెక్షన్, సౌండ్ టెక్నాలజీ..

కొన్ని శక్తివంతమైన స్పై కెమెరాల్లో బ్యాటరీని ఆదా చేయడం కోసం సౌండ్, మోషన్ డిటెక్షన్ టెక్నాలజీ పొందుపరుస్తారు. గతంలో హాస్టళ్లలో జరిగిన ఘటనలు పరిశీలిస్తే ఒక్కొక్కటి సుమారు రూ.3వేల లోపు విలువైన స్పై కెమెరా సౌండ్ యాక్టివేటెడ్ ఫీచర్స్ కలిగి ఉన్నాయి. మహిళలు బాత్‌రూం రావడానికి ముందు డోర్ తీయగానే ఆ శబ్దానికి ఆటోమేటిక్‌గా కెమెరా యాక్టివేట్ అయి వీడియో రికార్డ్ చేస్తుంది. వ్యక్తుల కదలికలను బట్టి దానంతట అదే రికార్డింగ్ అవుతుంది. ఒకసారి చార్జ్‌చేస్తే రెజల్యూషన్ బట్టి నాలుగైదు గంటల పాటు నిరంతరాయంగా ఈ కెమెరాలు వీడియో రికార్డ్ చేస్తాయి.

ఎన్నో రకాలు..

చాలా మంది అనుకుంటున్నట్లు చూడటానికి కెమెరా మాదిరి ఉండదు. మనకు ఏ మాత్రం అనుమానం రాకుండా రకరకాల వస్తువుల రూపంలో రూపొందిస్తారు. అనేక స్పై కెమెరాలను గమనిస్తే జేబులో పెన్, షర్టు బటన్స్, టేబుల్ మీద పెట్టే చిన్న క్లాక్‌లు, రిస్ట్ వాచీలు, ఫ్లవర్ వాజ్‌లు, కీచైన్లు, హ్యాంగర్స్, ఇంట్లో ఉండే ఫొటో ఫ్రేమ్‌లు, మొక్కలు, స్విచ్‌బోర్డులు, బల్బులు ఇలా అనేక విధాలా స్పై కెమెరాలు దొరుకుతున్నాయి.

అనేక రకాల పరీక్షలు..

స్పై కెమెరాలను గుర్తించేందుకు టెక్నిక్స్ ఉన్నాయి. కొన్ని రకాల కెమెరాలున్న ప్రదేశాల్లో ఫోన్ కాల్ చేసేందుకు ప్రయత్నిస్తే ఆది కాల్ డ్రాప్ అవుతుంది. ఆయా కెమెరాల్లో ఉండే మ్యాగ్నటిక్ తరంగాల వల్ల ఇలా జరుగుతుంది. ఇటీవల కాల్ డ్రాప్ అనేది తరచూ ఎదుర్కొనే సమస్య కావడంతో స్పై కెమెరా ఉందని అనుమానించలేని పరిస్థితి. ఇక ట్రయల్ రూమ్స్‌లో అమర్చే అద్దాలు రెండు రకాలుంటాయి. సహజంగా అద్దం ఒకవైపు మన రూపాన్ని చూపిస్తూ, దాని వెనుక భాగంలో వేరే రంగుతో కోటింగ్ చేయబడి ఉంటుంది. కానీ కొన్ని అద్దాలు పారదర్శకంగా ఉండి, ఇవతలి దృశ్యాలను అవతలికి చూపిస్తుంటాయి. మీకు అలాంటి అనుమానం వస్తే అద్దంలో కొద్దిగా ఖాళీ స్థలం ఉండాలి. అలా కాకుండా రెండు టచ్ అయినట్లు ఉంటే ఆ అద్దం అవతలి వైపు మీ దృశ్యాలను చూపిస్తుందని గ్రహించాలి. లైట్లన్నీ ఆఫ్ చేసి, ఫ్లాష్ లైట్‌ని అద్దం మీద వేసినప్పుడు అవతలి వైపు ఏదైనా ఉందేమో తెలుస్తుంది.

స్పై కెమెరాలతో ప్రమాదాలు

స్పై కెమెరాల ద్వారా మహిళల నగ్న దృశ్యాలను రికార్డ్ చేసి వాటిని పోర్న్ సైట్లలో అప్‌లోడ్ చేస్తున్న వారు ఇటీవల అధికమవుతున్నారు. మరికొంత మంది ఆ వీడియోలను సంబంధిత మహిళలకు పంపించి బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. ఎక్కడైనా ఇలా అనుమానాస్పదంగా ఉన్న స్పై కెమెరాలను గుర్తిస్తే వాటికి సంబంధించిన ఆధారాలను స్మార్ట్ ఫోన్లో వీడియో, ఫొటోల రూపంలో రికార్డు చేయాలి. సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. షాపింగ్ మాల్స్ వంటి వాటిలో ఫ్లోర్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లాలి. వీడియో ఫుటేజీ రికార్డ్ చేసి బ్లాక్ మెయిల్ చేస్తుంటే, వెంటనే కుటుంబ సభ్యులతో చర్చించి పోలీసుల దృష్టికి తీసుకెళ్లడం మంచిది. వృత్తి, ఉద్యోగాల్లో భాగంగా చాలా మంది మహిళలు నగరాల్లో హాస్టల్స్‌లో ఉంటున్నారు. వారు ఉండే గదులు, బాత్‌రూమ్‌లను నిశితంగా పరిశీలించాలి. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ స్పై కెమెరాలకు చెక్ పెట్టాలి.

మొబైల్స్‌తోనూ..

స్పై కెమెరాలు మాత్రమే కాదు, నిరంతరం మొబైల్ ద్వారా కూడా పబ్లిక్ ప్లేస్‌ల్లో మహిళల కదలికలు రికార్డు చేస్తున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్లలో ఎవరికీ అనుమానం రాకుండా ప్రివ్యూ కూడా కనిపించకుండా బ్యాక్ గ్రౌండ్‌లో వీడియోని రికార్డ్ చేసే యాప్స్‌ని వాడుతున్నారు.

భద్రు నాయక్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

- మాజీ ఎంపీ సీతారాంనాయక్, కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి


మాట్లాడుతున్న మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్, పక్కన రిజిస్ట్రార్ మల్లారెడ్డి, తదితరులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో చిరు ఉద్యోగిగా చేరి ప్రొఫెసర్ స్థాయికి ఎదిగి వివిధ పాలన పదవులను నిజాయితీగా నిర్వర్తించిన హిస్టరీ విభాగం దివంగత ప్రొఫెసర్ భద్రునాయక్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు కోరారు. ఇటీవల మృతి చెందిన కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ భద్రునాయక్ సంస్మరణ సభను బుధవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో నిర్వహించారు. ఈ సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ నిరుపేద గిరిజన కుటుంబం నుంచి వచ్చిన భద్రునాయక్ కేయూలో విద్యార్థులను తీర్చిదిద్దటంతోపాటు అంబేడ్కర్ స్టడీ సెంటర్ డైరెక్టర్‌గా అంబేడ్కర్, మహాత్మాజ్యోతిరావుపూలే ఆలోచనలను చైతన్యం చేసేందుకు వివిధ సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహించారన్నారు. భద్రునాయక్ మృతి అట్టడుగు, బడుగు, బలహీనవర్గాలకు తీరని లోటని అభిప్రాయపడ్డారు. నిబద్ధతతో సమాజం కోసం పనిచేసిన ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందని, అప్పుడే భద్రునాయక్‌కు నిజమైన నివాళి అన్నారు. పీఠం డీన్ భూక్యాబాబురావు నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్, కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ కె. వెంకటనారాయణ, టీపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమాదేవి, అంబేడ్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు సుదర్శన్, గిరిజన సామాజిక వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్, కుర్మా జనరల్ సెక్రటరీ వడ్డె రవీందర్,రిటైర్డ్ ఆచార్యులు విజయబాబు,ఎం. సారంగపాణి, ఎం. ఎర్రగట్టుస్వామి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేశ్ లాల్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మిద్దే ఎల్లయ్య, మానవహక్కుల వేదిక బాధ్యుడు బాదావత్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరాకు ఏర్పాట్లు

- త్వరలోనే అధికారులతో సమీక్ష సమావేశం
- ఉత్సవ కమిటీతో వరంగల్ కలెక్టర్ సత్యశారద


వరంగల్ : మాట్లాడుతున్న కలెక్టర్

ఖిలా వరంగల్: నగరంలోని రంగలీల మైదానంలో జరిగే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తామని వరంగల్ కలెక్టర్ సత్య శారద అన్నారు. త్వరలోనే అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు. రంగలీల మైదానంలో ఏర్పాట్లు చేయాలని కోరుతూ కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్య శారదకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ బతుకమ్మ, దసరా ఉత్సవాలు విజయవంతం అయ్యేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉత్సవ కమిటీ కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్న, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను నియంత్రించాలి

వరంగల్: జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణకు కఠినమైన చర్యలు తీసుకోవాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీసీపీ రవీందర్‌తో కలిసి బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా సరిహద్దులోని ఫారెస్ట్ భూముల్లో ఎక్కడైనా గంజాయి సాగుపై ఆరా తీయాలని ఆదేశించారు. మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి, డీఎంహెచ్ఓ వెంకటరమణ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ మంజుల పాల్గొన్నారు.

వయోవృద్ధుల దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

అక్టోబర్ 1న నిర్వహించే ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం పోస్టర్‌ను వరంగల్ కలెక్టర్ సత్య శారద కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్, డీఎంహెచ్ఓ వెంకటరమణ, సీడీపీఓ విద్య, వయోవృద్ధుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే నో పార్కింగ్ జోన్‌లో వాహనాలు నిలపొద్దు

- కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ పరిధిలో ప్రయాణికులకు ఇబ్బంది కలిగించేలా నిషేధిత రైల్వే ప్రాంతంలో రైల్వే ఉద్యోగులైనా, ప్రైవేట్ వ్యక్తులైనా పార్క్‌చేస్తే వారి వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయ న విలేకరులతో మాట్లాడుతూ వివిధ అవసరాల కోసం కాజీపేట జంక్షన్‌కు వచ్చిన వారు తమ వాహనాలు, కార్లను రైల్వే సర్క్యులేటింగ్ ఏరియాలోని నో పార్కింగ్ జోన్‌లో పార్క్ చేస్తున్నారన్నారు. ఈ దృశ్యాన్ని ఇటీవల తనిఖీల నిమిత్తం కాజీపేట జంక్షన్‌కు విచ్చేసిన రైల్వే సీనియర్ డీసీఎం చూసి సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో ఆర్పీఎఫ్ సీనియర్ డీఎస్సీ ఆదేశాలనుసారం రైల్వే నో పా ర్కింగ్ జోన్‌లో ఇక మీదట ఎవరూ పార్క్ చేయొద్దన్నారు. ఒకవేళా పార్క్ చేస్తే రైల్వే యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. కొందరి రైల్వే అ ధికారులకు నోటీసులు జారీ చేసినట్లు ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు తెలిపారు.

కేన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధనలు అవసరం

- యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ గీత వేముగంటి


ప్రొసీడింగ్స్‌ను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ గీత వేముగంటి, ఇతర ఆచార్యులు

కేయూ క్యాంపస్: కేన్సర్ స్టెమ్ సెల్స్‌పై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ డాక్టర్ గీత వేముగంటి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలోని జువాలజీ విభాగంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ అనిమల్ సైన్సెస్' అనే అంశంపై రెండు రోజులు నిర్వహించనున్న జాతీయ సదస్సును రిజిస్ట్రార్ మల్లారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గీత వేముగంటి కేన్సర్ స్టెమ్ సెల్స్‌పై కీలకోపన్యాసం చేశారు. సాధారణ కణాలు ఉత్పరివర్తనం చెందడం వల్ల అవి కేన్సర్ కణాలుగా మారుతాయని, ఇలాంటి కణాలు శరీరంలోని ఇతర భాగాలకు కూడా వ్యాప్తి చెంది చివరికి కేన్సర్ చివరి దశలో ప్రాణాపాయ స్థితిలోకి సంభవిస్తుందన్నారు. అందుకే కేన్సర్‌కు సంబంధించిన మూల కణాలపై పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి పరిశోధనల ఫలితాలే అనేక రకాల వ్యాధులకు ఔషధాలను సమకూర్చే వీలుంటుందన్నారు. అనంతరం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి. మల్లారెడ్డి మాట్లాడుతూ బయోటెక్నాలజీ రంగంలో దేశం ముందుకెళ్తోందని, విద్యార్థులు, సమాజానికి ఉపయోగపడే పరిశోధనలపై దృష్టిసారించాలన్నా రు. ఈ సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య జి. షమిత, ఆ విభాగం ఆచార్యులు వై. వెంకయ్య, ఈసం నారాయణ, మామిడాల ఇస్తారి మాట్లాడారు. ఈసెమినార్‌లో ప్రొసీడింగ్స్‌ను విడుదల చేశారు. కాగా, రెండురోజులపాటు వివిధ చోట్ల నుంచి వచ్చిన వారు పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు. ఈనెల26న సాయంత్రం ముగియనున్నది.

ప్రజారోగ్యంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి లలితాదేవి


డాక్టర్ లలితాదేవిని సత్కరిస్తున్న ఫార్మసిస్టులు

ఎంజీఎం: ప్రజారోగ్య సంక్షేమంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమని హనుమకొండ డీఎంహెచ్ఓ లలితాదేవి పేర్కొన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వ ఫార్మసిస్టుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా డీఎంహెచ్ఓ లలితాదేవి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఫార్మసిస్టులు కరోనా సమయంలో అందించిన సేవలను ఆమె ప్రత్యేకంగా కొనియాడారు. విశిష్ట అతిథిగా హాజరైన వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ మాట్లాడుతూ.. వైద్యరంగంలో ఫార్మసిస్టులకు అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. డీఎంహెచ్ఓగా పూర్తి బాధ్యతలు తీసుకున్న డాక్టర్ లలితాదేవిని ఘన్కంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఐ రవికిరణ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శరత్‌బాబు, సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ ఇన్‌చార్జ్ ఉప్పు భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల సేవలు వెలకట్టలేనివి

ఎంజీఎం డీసీఎస్ఆర్ఎంఓ మురళి

హన్మకొండ కల్చరల్: ఫార్మసిస్టుల ప్రాధాన్యం వెలకట్టలేనిదని వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ డీసీఎస్ఆర్ఎంఓ కె.మురళి అన్నారు. అంతర్జాతీయ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కె.మురళి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ డాక్టర్లు రోగులకు ప్రాణాలు పోస్తే, ఫార్మసిస్టులు మందులకు ప్రాణాలు పోస్తారని అందుకే డాక్టర్లు, ఫార్మసిస్టులు కలిసి పనిచేయాలన్నారు. అనంతరం ఫార్మసిస్టులను ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చల్లా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో విశిష్ట అతిథులు డాక్టర్ ఎస్.సనత్‌రోషన్, కళాశాల ఫార్మడీ హెచ్ఓడీ డాక్టర్ బీఎస్ శరవణభవ, ఫార్మసీ కాలజీ హెచ్ఓడీ డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అక్టోబర్ 27న మోషన్ టాలెంట్ సెర్చ్ టెస్ట్

హన్మకొండ: టాలెంట్ సెర్చ్ టెస్ట్‌ను అక్టోబర్ 27న నిర్వహించనున్నట్లు మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ తెలిపారు. టాలెంట్ టెస్ట్ బ్రోచర్‌ను హనుమకొండ నయీంనగర్‌లోని ఇనిస్టిట్యూట్‌లో అధ్యాపకులతో కలిసి ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ టాలెంట్ సెర్చ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా నిర్వహించే ఈ టెస్ట్‌లో ప్రతిభ కనపరచిన వారికి రూ.150 కోట్ల స్కాలర్‌షిప్‌లు, రూ.2 కోట్ల ప్రైజ్ మనీ, 500 మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించనున్నట్లు వివరించారు. అదే విధంగా మోషన్ హనుమకొండ సెంటర్ నుంచి ఐదుగురు విద్యార్థులకు పూర్తి ఉచిత విద్య, ఐదుగురు విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొత్తం రూ.18 లక్షల స్కాలర్‌షిప్‌తోపాటు, మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్, రెండో ర్యాంకు సాధించిన విద్యార్థికి ట్యాబ్ అందించనున్నట్లు వివరించారు. ఆసక్తిగల విద్యార్థులు హనుమకొండ నయీంనగర్‌లోని మోషన్ ఇనిస్టిట్యూట్‌లో లేదా.. 97030 00850, 97030 00851, 97030 00852 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్, బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేశ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మురళి, మార్కెటింగ్ మేనేజర్ శనిగరపు సుమన్, మార్కెటింగ్ టీం సభ్యులు తాళ్లపల్లి రమేశ్‌గౌడ్, పాక నాగరాజు, రచ్చ కుమార్, మండల రాజు, అరుణ్ పాల్గొన్నారు.

డెంగీని నియంత్రించాలి : డీఎంహెచ్ఓ


ఎల్‌బీనగర్‌లో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్ఓ వెంకటరమణ

వరంగల్: నగరంలో డెంగీ నియంత్రించేందుకు ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని డీఎంహెచ్ఓ కె.వెంకటరమణ అన్నారు. వరంగల్ ఎల్‌బీనగర్ ప్రాంతంలో డెంగీ వ్యాధిగ్రస్తుడి ఇంటిని బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. మున్సిపల్ సిబ్బంది సహకారంతో దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. బయాలజిస్ట్ మాధవరెడ్డి, ఇన్‌చార్జ్ ఏఎంఓ మాడిశెట్టి శ్రీనివాస్, ఎస్‌యూఓ విజయేంద్రకుమార్ సూపర్‌వైజర్ సదానందం, వైద్య సిబ్బంది మసూద్ అలీ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుల కేసులు సత్వరమే పరిష్కరించండి


మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

హన్మకొండ అర్బన్: తలిదండ్రులు, వయో వృద్ధుల పోషణ చట్టం కింద పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అక్టోబర్ 1న నిర్వహించే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ.. వయో వృద్ధుల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అందుకోసం విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. అందుకు సంబంధించిన వివరాలతో కూడిన బ్రోచర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజమణి, డీఎంహెచ్ఓ లలితాదేవి, డీఈఓ వాసంతి, ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, ఇతర అధికారులు ఉన్నారు.

కష్టపడి చదివితేనే ఉన్నత స్థితికి

కేయూ క్యాంపస్: విద్యార్థులు కష్టపడి చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థితిలోకి రావాలని ఆర్థిక స్వాతంత్ర్యంతోనే స్వావలంబన సాధ్యమని సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా అన్నారు. బుధవారం కేయూలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఆ కళాశాల ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సలీమా పాల్గొని మాట్లాడుతూ.. మహిళలు ముందుండాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగమణి మాట్లాడుతూ.. చదువుతోపాటు వ్యక్తిగత రక్షణ సమాజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బ్లడ్ డొనేషన్‌కు సంబంధించిన పోస్టర్లను సెంట్రల్ జోన్ డీసీపీ విడుదల చేశారు. కార్యక్రమంలో కేయూ పాలకమండలి సభ్యులు బి.సురేశ్‌లాల్, డాక్టర్ బి.రమ, కళాశాల ప్రిన్సిపాల్ కె.భిక్షాలు అధ్యాపకులు డాక్టర్ ఎస్.వీణ, తూర్పాటి వెంకటేశ్, సురేందర్, సాయి, దీప్తి, వైష్ణవి, రచన, శ్రీజ, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

27న కలెక్టరేట్‌లో జాబ్ మేళా

హన్మకొండ అర్బన్: ఈనెల 27న హనుమకొండ కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో అపోలో ఫార్మసీలో పని చేసేందుకు ఉద్యోగులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డీ.బీ.ఎం ఫార్మసీ చేసిన వారు, ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ పాసైన వారికి అర్హతను బట్టి అపోలో ఫార్మసీలో ఉద్యోగావకాశాలుంటాయని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు 27న ఉదయం 11గంటల నుంచి నిర్వహించే జాబ్‌మేళాకు తమ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, 18నుంచి 35ఏళ్ల మధ్య వయస్కులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైనవారికి 11,600 నుంచి 25,000 వరకు వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలుంటాయని తెలిపారు. వివరాలకు 78933 94393 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.